

## కండ్లముందు కటికనిజం.. కాళేశ్వర జలాలే సాక్ష్యం

తెలంగాణకు ప్రాణధార కాళేశ్వరమే. ఆ జలరేఖను చెరిపేయలేరనేది వాస్తవం. రంగనాయక్‌సాగర్‌లో ఉప్పొంగుతున్న గోదావరిని జలతరంగ దృశ్యానికి సాక్ష్యమీ చిత్రం. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సోమవారం ఎక్స్‌వేదికగా ఈ ఏరియల్ ఫొటోను షేర్ చేశారు. 'వందలాది కిలోమీటర్లు ప్రయాణించి, రంగనాయకసాగర్‌కు చేరిన గోదావరిగంగ. ఇది కాళేశ్వరం సృష్టించిన అపురూప దృశ్యం. అద్భుత జల సౌందర్యం. కాళేశ్వరాన్ని బద్నాం చేస్తున్న కబోదుల్లారా.. కన్నులు తెరిచి ఈ సుందర దృశ్యం చూడండి. కాళేశ్వరం తెలంగాణకు ప్రాణధార అనే సత్యాన్ని చెరిపేయలేమని గుర్తించండి' అని ఆయన పేర్కొన్నారు. అపర భగీరథుడు కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రంగనాయక సాగర్ నిండు కుండలా మారిన దృశ్యమని, ప్రతీనీటి చుక్కలో ఉన్న కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయలేమని తేల్చిచెప్పారు.



## ఏడాది పాలనలో కటింగ్‌లు, కటాఫ్‌లే!

- రాష్ట్రంలో ప్రజలకు ఒరిగిందేమీలేదు: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఏడాది పాలనలో కటింగ్‌లు, కటాఫ్‌లే తప్ప, రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో కోతలు, కటాఫ్‌లపై ఎక్స్ వేదికగా ఆయన ఎండగట్టారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, సాగునీరు, కరెంట్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, తులం బంగారం, మహాలక్ష్మి రూ.2,500, పింఛన్ రూ.4,000, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్, రూ.2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేల పింఛన్, ఉద్యమకారులకు 250 గజాల జాగ, రైతులకు రూ.3 లక్షల వడ్డీలేని రుణాలు, భూమిలేని రైతులకు రైతుబీమా, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం, ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం, 50 ఏండ్లు పైబడిన జానపద కళాకారులకు రూ.3 వేల పింఛన్.. ఇలా అన్నీ కట్ చేసిందని విమర్శించారు.

# రైతు ధర్నా అంటే భయమెందుకు?

- నల్లగొండ రైతు ధర్నాతో మీకెందుకు భయం
- కేటీఆర్ వస్తానంటే ఎందుకు అడ్డుకుంటున్నరు?
- ఏడాది పాలనలో అక్రమాలపై చర్చకు సిద్ధమా?
- మంత్రి కోమటిరెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్



సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో తుంగబాలు, ధర్మేందర్‌రెడ్డి, సంజీవ్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజల్లోకి వస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. నల్లగొండ రైతు ధర్నాకు వస్తానంటే మీరెందుకు భయపడుతున్నారని నిలదీశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా కమిటీ చేపట్టిన రైతు ధర్నాను అడ్డుకోవడం కాంగ్రెస్ సర్కార్ చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికుట్రలు చేసినా అన్నదాతల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టంచేశారు. నల్లగొండలో రైతు ధర్నా చేపడితే అక్కడికి వచ్చిన రైతులు మంత్రి కోమటిరెడ్డిని బట్టలూడదీసి కొడతారనే భయంతోనే అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాజ్‌భవన్ ఎదుట సీఎం, మంత్రులు నిరసన చేపడితే లేని ఇబ్బంది, నల్లగొండ క్లాక్‌టవర్ వద్ద చేపడితే ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. అక్కడ కలగని ట్రాఫిక్ ఇబ్బందులు, నల్లగొండలో కలుగుతాయా అని నిలదీశారు. రైతులు తిరగబడుతున్నారనే ధర్నాలను అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు.

### నల్లగొండ అభివృద్ధిపై చర్చిద్దామా?

పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో నల్లగొండ అభివృద్ధిపై చర్చించే దమ్మున్నదా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. పదేండ్లలో ఉమ్మడి నల్లగొండ అభివృద్ధికి కేసీఆర్ సహకారంతో తాను వేసిన పునాదిరాళ్లు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ప్రగతిని లెక్కించడానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జీవితకాలం సరిపోదని పేర్కొన్నారు. 40 ఏండ్లు మీకు ఉమ్మడి జిల్లాను ప్రజలు అప్పగిస్తే ఆస్తులు, ఆకారాలను పెంచుకొని ప్రజలను పీల్చుకుతిన్నారని మండిపడ్డారు. మిల్లర్లతో కుమ్మక్కై రైతుల పంటలను కాంగ్రెస్ దళారుల చేతిలో పెట్టి రూ.కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. 'నల్లగొండ జిల్లాలో ఎక్కడ దొరికితే అక్కడ మిమ్మల్ని బట్టలూడదీసి కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. పోలీసులు, సెక్యూరిటీ లేకుండా జిల్లాలో ఎక్కడికైనా వెళ్లి తిరిగి రాగలవా? బీఆర్‌స్ పదేండ్ల అభివృద్ధిపై మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోండి' అంటూ మంత్రి కోమటిరెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

### బీఆర్‌ఎస్‌తోనే ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించిన ఘనత కేసీఆర్‌దని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కరవు కాటకాలతో అల్లాడాతున్న ఉమ్మడి జిల్లా బీడు భూములను పదేండ్ల పాలనలో సస్యశ్యామలం చేశామని తెలిపారు. రైతులు పండించిన వడ్లను కల్లాల వద్దే కొనుగోలు చేసి, వెంటనే నగదును వారి ఖాతాల్లో వేశామని తెలిపారు. తడిసిన, మొలకెత్తిన వడ్లను మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతుల కన్నీరు తుడిచామని గుర్తుచేశారురు. స్వర్ణయుగంలా సాగిన పదేండ్ల కేసీఆర్ పాలనపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి లేదని స్పష్టంచేశారు. కోమటిరెడ్డి స్పృహ లేకుండా మాట్లాడుతున్నారని, కండ్లు తెరిచి చూస్తే గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపిస్తుందని హితవు పలికారు. సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని అసమర్థ నేతలకు గత బీఆర్‌ఎస్ పాలనపై మాట్లాడే అర్హత లేదని హెచ్చరించారు.

## కక్ష సాధింపు మాని.. నీళ్లివ్వండి

- కాంగ్రెస్ పాలనలో రైతన్న కన్నీటి గోస
- సాగునీటి కోసం రోడ్డెక్కిన సూర్యాపేట రైతులు
- నీళ్ల మంత్రి జిల్లాలోనే ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితేంటి?: హరీశ్‌రావు



హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ):'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. రైతన్నకు కన్నీటి గోస తెచ్చింది' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పంట పొలాలకు సాగునీటి కోసం అన్నదాతలు రోడ్లెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని సోమవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత జిల్లా సూర్యాపేటలోనే రైతన్నలు నీటి కోసం రెడ్డెక్కారని తెలిపారు. యాసంగి సాగు నీటి విడుదల షెడ్యూల్ పేరిట రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి ప్రకటనలు ఇచ్చారని, ఎస్సారెస్పీ స్టేజ్-2లో భాగంగా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాల్లోని 3,36,639 ఎకరాలకు సాగునీటిని విడుదలచేస్తామని పేర్కొన్నారని గుర్తుచేశారు. ప్రచారం చేసుకున్నారు కానీ, పంట పొలాలకు నీళ్లు విడుదలచేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీటిపారుదల శాఖ మంత్రి సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే, రాష్ట్రవ్యాప్తంగా రైతుల పరిస్థితేమిటని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అద్భుతాలు చేస్తున్నట్టు భ్రమలు కల్పించడం మానేసి ఇప్పటికైనా ఆచరణకు దిగాలని హితవు పలికారు. రాజకీయ కక్షలు మానేసి పంట పొలాలకు నీళ్లందించాలని కోరారు.

### మహిళా కమిషన్ సభ్యులకు జీతాలేవి?

ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామంటున్న సీఎం, మంత్రుల మాటలు నేతి బీరకాయలో నెయ్యి చందంగా ఉన్నాయని హరీశ్‌రావు దుయ్యబట్టారు. మహిళా కమిషన్ సభ్యులకు ఏడాది నుంచి జీతాలు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. గత సంవత్సరం నుంచి వారికి జీతాలు ఇవ్వడంలేదని తెలిపారు. బడ్జెట్‌లో మహిళా కమిషన్‌కు రూ.2. 42 కోట్లు కేటాయించినప్పటికీ, విడుదల చేసింది మాత్రం రూ.20 లక్షలకు మించలేదని పేర్కొన్నారు. న్యాయమూర్తులతో సమానంగా వ్యవహరించే మహిళా కమిషన్ సభ్యులకే జీతాలు చెల్లించకపోతే, ప్రభుత్వం సామాన్య మహిళల హక్కులను ఏ విధంగా కాపాడుతుందని నిలదీశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదలచేయాలని, మొదటి తారీఖునే మహిళా కమిషన్ సభ్యులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు.

# రైతు ధర్నాకు అనుమతి నిరాకరణ

- ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే పోలీసుల వెనుకంజ?
- హైకోర్టును ఆశ్రయించిన బీఆర్‌ఎస్ పార్టీ నేతలు
- 27వ తేదీకి విచారణ వాయిదా
- తదుపరి విచారణ వరకు మహాధర్నా వాయిదా




నల్లగొండలో రైతు మహాధర్నా సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ చేసిన ఏర్పాట్లు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 20(నమస్తే తెలంగాణ): నల్లగొండ క్లాక్‌టవర్ వేదికగా బీఆర్‌ఎస్ మంగళవారం నిర్వహించ తలపెట్టిన రైతు మహాధర్నాకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రభుత్వ పెద్దలే పోలీసు యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నట్టు తెలిసింది. మంగళవారం నాటి మహాధర్నాకు అనుమతి కోసం ఈ నెల 17న సాయంత్రమే నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డికి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ దరఖాస్తు చేశారు. ఇదే విషయమై 18న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కలిసి అనుమతి కోసం విజ్ఞప్తి చేసింది. మూడ్రోజుల అనంతరం సోమవారం ఉదయం 11 గంటల తర్వాత రైతు మహాధర్నాకు అనుమతి నిరాకరిస్తూ లేఖ ఇవ్వడం విస్మయం కలిగించింది. ఇందుకు పోలీసులు చూపిన అభ్యంతరాలపై బీఆర్‌ఎస్ నేతలు భగ్గుమన్నారు. రైతుల నుంచి కాంగ్రెస్ సర్కారుపై వస్తున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో కేటీఆర్ పాల్గొననున్న రైతు మహాధర్నాకు కక్షపూరితంగా అనుమతి ఇవ్వడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. న్యాయస్థానాల ద్వారా అనుమతి సాధించి కొంత ఆలస్యమైనా నల్లగొండలో మహాధర్నా నిర్వహించి తీరుతామని స్పష్టంచేశారు.

### చకాచకా ఏర్పాట్లు

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో నల్లగొండ ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. ఫ్లెక్సీలు, కటౌట్లు ఇతర ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయ్యాయి. నల్లగొండ పట్టణవ్యాప్తంగా రైతుధర్నా ఫ్లెక్సీలు వెలిశాయి. వాహనాలు, మైక్ సిస్టం, తాగునీరు, ఇతర సదుపాయాలన్నింటినీ సిద్ధం చేశారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండకు వచ్చిన అనంతరం పోలీసులు అనుమతిని నిరాకరిం చారు. ధర్నా ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లను చూసి మంత్రి కోమటిరెడ్డి జీర్ణించుకోలేక పోయినట్టు తెలిసింది. ఆయనే పోలీసులపై ఒత్తిడి తెచ్చి అనుమతి ఇవ్వకుండా చేశారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు.

### నిరాకరణకు కుంటిసాకులు

నల్లగొండలో కేటీఆర్ రైతు మహాధర్నాకు పోలీసులు చూపిన కారణాలు చర్చనీయాంశంగా మారాయి. క్లాక్‌టవర్ సెంటర్ చాలా ఇరుకైన ప్రాంతమని, రద్దీ జంక్షన్ అని, చిన్న రోడ్లు అని, చుట్టూ కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉండటంతో రోజంతా ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ రోడ్లు లేవని చూపించారు. పక్కనే దర్గా స్థలం, ఎన్జీ కాలేజీ మైదానం అందుబాటులో ఉన్నా వాహనాల పార్కింగ్‌కు స్థలం లేదంటూ మరోసాకు చూపారు. సంక్రాంతి పండుగ రద్దీతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతారంటూ తదితర కారణాలను తెరపైకి తెచ్చారు. ఇక చివరగా ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు ఉన్నాయని, దాంతో పోలీస్ ఫోర్స్ అంతా అటే వెళ్తుందని, ధర్నాకు బందోబస్తు కల్పించలేమని స్పష్టంచేస్తూ అనుమతి నిరాకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

### హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్

కేటీఆర్ రైతు మహాధర్నాకు అనుమతి నిరాకరణపై బీఆర్‌ఎస్ నేతలు వెంటనే హైకోర్టును ఆశ్రయించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ పేరుతో రైతు మహాధర్నాకు అనుమతించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం సాయంత్రం విచారించిన కోర్టు డీజీపీని వివరణ కోరింది. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రభుత్వ గ్రామసభలు, ఈ నెల 26న రిపబ్లిక్ డే ఉన్న నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఇవ్వడం ఇబ్బందికరమని పేర్కొన్నట్టు తెలిసింది. దాంతో హైకోర్టు ఈ పిటిషన్ విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసినట్టు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. 27 తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు రైతు ధర్నా నిర్వహించి తీరుతామని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వెల్లడించారు.

## రైతులు తిరగబడ్తరనే అనుమతి ఇవ్వలే

- దేవీప్రసాద్‌ఆగ్రహం



హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): రైతులు తిరుగుబాటు చేస్తారనే బీఆర్‌ఎస్ రైతు ధర్నాకు అనుమతి నిరాకరిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. అలవికాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ వైఖరిని నిరసిస్తూ చేపట్టిన ధర్నాకు అడ్డుచెప్పడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో అనేక సందర్భాల్లో క్లాక్‌టవర్ వద్ద అన్నివర్గాలు నిరసనలు తెలిపిన విషయం కాంగ్రెస్ మంత్రులు మరిచారా? అని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడే దీక్ష చేసిన విషయం గుర్తులేదా? అని ప్రశ్నించారు. అక్రమ మైనింగ్‌ను నిరసిస్తూ ప్రజా ఉద్యమానికి మద్దతుగా తెలుపుతున్న పౌరహక్కుల సంఘం నేతలు లక్ష్మణ్, హరగోపాల్ తదితర నేతలను అరెస్ట్ చేసి నిర్బంధించడం అక్రమమని విమర్శించారు.

### ఇదేం ప్రజాపాలన?: బాల్క సుమన్



ముఖ్యమంత్రి, మంత్రులు ధర్నా లు చేస్తే లేని ఇబ్బందులు, బీఆర్‌ఎస్ నేతలు ధర్నాలు చేస్తే కలుగుతాయా? అని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు రాజ్‌భవన్ ఎదుట ధర్నా చేయొచ్చు కానీ, రైతుల కోసం కేటీఆర్ ధర్నా చేస్తే అనుమతి ఎందుకివ్వరని ప్రశ్నించారు.

# ప్రశ్నిస్తారనే ప్రభుత్వానికి భయం

- నల్లగొండ రైతు ధర్నాకు అనుమతివ్వని ప్రభుత్వం
- హామీల అమలుపై అడిగితే కేసులు, వేధింపులు
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజం
- కోర్టు అనుమతితో నిర్వహిస్తామని స్పష్టీకరణ



సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కర్నె ప్రభాకర్. చిత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లె రవి, కిశోర్ తదితరులు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ రైతు ధర్నా నిర్వహిస్తే భయమెందుకని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే కేసులతో వేధిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో రైతు ధర్నాను అడ్డుకోవడం రాజకీయకక్ష అని విమర్శించారు. రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని ఎగ్గొట్టిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే ధర్నాకు అనుమతి నిరాకరించారని ధ్వజమెత్తారు. నల్లగొండ ధర్నాకు కేటీఆర్ వస్తే ప్రజలు బ్రహ్మరథం పడతారనే అక్కసుతోనే అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇటీవల షాబాద్‌లో నిర్వహించిన సభకు రైతులు వేలాదిగా తరలివచ్చారని చెప్పారు. నల్లగొండకు అంతకుమించి తరలివస్తారని పాలకులకు భయం పట్టుకున్నదని తెలిపారు. కోర్టు అనుమతితో నల్లగొండలో రైతు ధర్నా నిర్వహిస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కిశోర్‌గౌడ్, పల్లె రవి తదితరులు పాల్గొన్నారు.



సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేస్తున్న తెలంగాణ జాగృతి మహిళా విభాగం ప్రతినిధులు

## మార్ఫింగ్ నిందితులపై చర్యలు తీసుకోవాలి

- కవిత ఫొటోల విషయమై పోలీసులకు జాగృతి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ జాగృతి మహిళా విభాగం సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి 'అరవింద్ అన్న ఆర్మీ' అనే ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్టు చేసి సర్క్యులేట్ చేశారని మేడ్చల్ జిల్లా జాగృతి మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ లలితాయాదవ్ మండిపడ్డారు. ఇందుకు కారణమైన వారిని గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జాగృతి నాయకురాళ్లు వాసగొని శోభ, బండారి లావణ్య, స్వప్నరెడ్డి, సింగిరెడ్డి విమల, శ్రీలత, మహేశ్వరి, రత్న పెంటమ్మ తదితరులు ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పిండు

- కలెక్టర్‌కు వేముల లేఖ

మోర్తాడ్, జనవరి 20: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పిండని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు నిరసనగా ఈ దఫా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీని బహిష్కరిస్తున్నట్టు సోమవారం ఆయన కలెక్టర్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కల్యాణలక్ష్మి పథకం కింద లక్ష చెక్కుతోపాటు తులం బంగారం ఇస్తానని రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదైనా బంగారం ఇవ్వక మాట తప్పినందుకు నిరసనగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు.